
సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 3 । ఏప్రిల్ । 2025



ముమ్మరంగా మాసూళ్లు

దాళ్వా మాసూళ్లలో రైతులు నిమగ్నమయ్యారు. వాతావరణం అనుకూలించడంతో దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని ఆశిస్తున్నారు. 8లో ▸



మెట్ట.. నీటికి కటకట!

భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో ఈ వేసవిలో మెట్టలో నీటి ఎద్దడి తలెత్తే ప్రమాదముంది. బోర్లు, బావులు ఇప్పటికే అడుగంటిపోయాయి. 8లో ▸



జామాయిల్ తోటలో అగ్నిప్రమాదం

ద్వారకాతిరుమల మండలంలోని రాళ్లకుంటలో ఇటీవల నరికివేసిన జామాయిల్ తోటలో బుధవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. 8లో ▸

న్యూస్‌రీల్

కాలనీల్లో ప్రజల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్ నాగరాణికి వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

భీమవరం: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ కాలనీలు, టిడ్కో గృహాల్లోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వీ గోపాలన్ అన్నారు. బుధవారం సీపీఎం ప్రతినిధి బృందంతో కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రత్యేక సమావేశం నిర్వహించిన సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ జిల్లాస్థాయి ప్రజా చైతన్య సైకిల్ యాత్ర నిర్వహించగా అనేక సమస్యలు తమ దృష్టికి వచ్చాయన్నారు. వాటిలో తక్షణం పరిష్కారయుతంగా ఉన్న మౌలిక సమస్యలైన దారి లేని కాలనీలు, టిడ్కో ఇళ్ల శ్లాబ్ లీకేజీలు, అసంపూర్తి నిర్మాణాలు వంటి వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.వాసుదేవరావు, కౌరు పెద్దిరాజు తదితరులున్నారు.

ఇళ్ల స్థలాల కోసం ధర్నా



భీమవరం కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

భీమవరం: పేదల ఇళ్లస్థలాలకు సంబంధించి ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ తక్షణం నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. ఇళ్లులేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఐ, ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం భీమవరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి, డీఆర్‌ఓకు అర్జీలు సమర్పించారు. అనంతరం భీమారావు మాట్లాడుతూ ఎన్నికల ముందు పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలిచ్చి ఇంటి నిర్మాణానికి రూ.4 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. తొమ్మిది నెలలు గడిచిపోయినా హామీలను అమలు చేయలేదన్నారు. సత్వరమే ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కలిశెట్టి వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారామ్‌ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తమరాని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్

భీమవరం: భీమవరంలో బుధవారం నిర్వహించిన జేఈఈ మెయిన్స్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పట్టణంలోని డీఎన్నార్ కళాశాలలో ఉదయం షిఫ్ట్‌లో 100 మందికి 93 మంది, మధ్యాహ్నం షిఫ్ట్‌లో 100 మందికి 95 మంది హాజరయ్యారని పరీక్షల పర్యవేక్షకుడు సూర్యనారాయణమూర్తి చెప్పారు.

ప్రసూతి మరణాలు నివారించాలి



వైద్యాధికారులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రసూతి మరణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డా గీతాబాయి ఆదేశించారు. జిల్లాలో ప్రసూతి మరణాలపై బుధవారం వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయి సిబ్బందికి తగు సూచనలు చేశారు.

ఉపాధి హామీలో 'పశ్చిమ' ముందంజ

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో పెద్ద ఎత్తున ఉపాధి హామీ పనులను చేపట్టాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. రెట్టింపు పని దినాల కల్పనతో జిల్లా ముందంజలో ఉందన్నారు. 2024 – 25 ఆర్థిక సంవత్సరంలో 39 లక్షల పని దినాలు లక్ష్యం కాగా 37.71 లక్షల పని దినాలు కల్పించి 96.69 శాతానికి పైగా లక్ష్యం సాధించినట్లు చెప్పారు . ఉపాధి హామీ పథకం నిధులతో మొత్తం 33 వేల పనులు చేపట్టగా, 25 వేల పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 40 లక్షల పని దినాల లక్ష్యసాధనతో పాటు మూగ జీవాలకు 140 నీటి తొట్టెల నిర్మాణానికి సుమారు రూ.50 లక్షల వ్యయంతో అంచనాలు తయారు చేసి ఏప్రిల్ నెలాఖరుకు పూర్తి చేయాలని నిర్దేశించుకున్నామని చెప్పారు. 20 వేల కిలోమీటర్ల పొడవైన పూడికతీత పనులు, 200 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం పనులు, పశుగ్రాస పెంపకం పనులు, తాగునీటి సాగునీటి చెరువుల పునరుద్ధరణ పనులు చేపట్టాలన్నారు.

నెల నెలా కోత

- పది నెలల్లో 7,167 పింఛన్ల తగ్గింపు
- జూన్‌లో 2,32,885 మందికి రూ.99.7 కోట్ల పంపిణీ
- ఈ ఏడాది ఏప్రిల్‌లో 2,25,718 మందికి రూ.96.87 కోట్ల సాయం
- కొత్త పింఛన్ ఒక్కటీ మంజూరు చేయని వైనం
- పెండింగ్‌లో 20 వేలకు పైగా దరఖాస్తులు

'భీమవరంలోని పేద వృద్ధ దంపతులు చిన్నారావు, సత్యవతిల ఇద్దరు కుమారులు పనుల కోసం వేరే ఊళ్లు వలస వెళ్లిపోయారు. వృద్ధాప్య పింఛనే దంపతుల జీవనాధారం. గత ఆగస్టులో చిన్నారావు మృతిచెందగా స్పౌజ్ కోటాలో తర్వాతి నెల నుంచి సత్యవతికి పింఛన్ అందాలి. కూటమి ప్రభుత్వం ఆ ఆప్షన్ క్లోజ్ చేయడంతో ఆమెకు పింఛన్ సాయం అందక తీవ్ర ఇబ్బంది పడుతోంది. ఆమె ఒక్కరే కాదు జిల్లా వ్యాప్తంగా అర్హత కలిగిన వేల మంది పింఛన్ కోసం అధికారులకు అర్జీలు అందజేసి కళ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు.

సాక్షి, భీమవరం: వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఇతర సామాజిక పింఛన్ల లబ్ధిదారుల వెతలకు చెక్ పెట్టారు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే చాలు రాజకీయాలు, కులమత వర్గాలు చూడకుండా లబ్ధిదారులను ఎంపిక చేసేవారు. ఏటా జనవరి, జూలై నెలల్లో కొత్త పింఛన్లు మంజూరు చేసేవారు. ఇంటికే వచ్చి పింఛన్ అందించే ఏర్పాటు చేశారు. ఎన్నికల్లో చెప్పినట్టుగానే రూ. 2000 పింఛన్‌ను ఏటా పెంచుతూ రూ.3000 చేశారు. 2019 నాటికి జిల్లాలో సుమారు 1.45 లక్షలు ఉన్న పింఛన్లు వైఎస్సార్‌సీపీ హయాంలో 2.36 లక్షలకు చేరుకోవడం గమనార్హం.

ప్రతి నెలా కోతే

పింఛన్ సాయాన్ని రూ.4000 చేశామంటున్న కూటమి ప్రభుత్వం కొత్త పింఛన్లు మాత్రం మంజూరు చేయడం లేదు. పెంచిన భారం ఖజానాపై పడకుండా ఉన్నవాటికి కోత పెడుతోంది. 2024, జూన్‌లో 2,32,885 మందికి రూ.99.8 కోట్ల పింఛన్ సాయం అందిస్తే, ఈ ఏడాది ఏప్రిల్‌లో లబ్ధిదారుల సంఖ్య 2,25,718 మందికి తగ్గిపోయారు. వారికి అందించే సాయం రూ.96.8 కోట్లకు చేరింది. పది నెలల కాలంలో 7,167 పింఛన్లకు కూటమి కోత పెట్టడం ద్వారా ప్రభుత్వ ఖజానాపై దాదాపు రూ.25 కోట్లు భారాన్ని తగ్గించుకున్నట్టు అంచనా.

గత పది నెలల్లో జిల్లాలోని పింఛన్ల పంపిణీ వివరాలు

నెల	పింఛన్లు	సాయం (రూ. కోట్లలో)
జూన్	2,32,885	99.80
జూలై	2,31,874	99.20
ఆగస్టు	2,31,075	99.18
సెప్టెంబరు	2,30,123	96.57
అక్టోబరు	2,29,184	96.19
నవంబరు	2,28,362	96.25
డిసెంబరు	2,27,755	96.49
జనవరి	2,27,086	96.72
ఫిబ్రవరి	2,26,044	96.61
మార్చి	2,25,718	96.87



స్పౌజ్ పింఛన్లలో వింత పోకడ

పింఛన్ లబ్ధిదారుడు మృతిచెందితే మరుసటి నెల నుంచే అతని భార్య(స్పౌజ్)కు పింఛన్ మంజూరయ్యేలా యాప్‌లో ఆప్షన్ ఉంటుంది. కూటమి పాలన చేపట్టిన వెంటనే పింఛన్ సైట్‌ను క్లోజ్ చేయడంతో స్పౌజ్ పింఛన్ల మంజూరు ఆగిపోయాయి. నవంబరులో స్పౌజ్ ఆప్షన్ ఇచ్చినా కేవలం ఆ నెల నుంచి మృతిచెందిన వారి భార్యలకు మాత్రమే సాయం అందేలా కొర్రి పెట్టింది. దీంతో అంతకు ముందు చనిపోయిన వారి కుటుంబాలకు పింఛన్ సాయం అందకుండా పోయింది. అధికారుల అంచనాల మేరకు జిల్లాలో 6000 మంది వరకు పింఛన్ లబ్ధిదారులు మృతిచెందగా కేవలం 607 మందికి మాత్రమే ప్రభుత్వం స్పౌజ్ పింఛన్ అందిస్తోంది.

50 ఏళ్లకే పింఛన్ హామీ గాలికి

తమ ప్రభుత్వం వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 ఏళ్లకే వృద్ధాప్య పింఛన్ ఇస్తామని చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ఎన్నికల సభల్లో ఊదరగొట్టారు. పాలనలోకి వచ్చి పది నెలలు గడిచినా వాటి ఊసెత్తడం లేదు. జిల్లాలో 50 ఏళ్ల నుంచి 60 ఏళ్ల లోపు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు సుమారు రెండున్నర లక్షల మంది వరకు ఉండగా వారిలో 70 శాతం మంది అర్హులు ఉంటారని అంచనా. ప్రభుత్వం 50 ఏళ్లకే పింఛన్ హామీ గురించి మాట్లాడకపోవడం ఆయా వర్గాల వారిని తీవ్ర నిరాశకు గురిచేస్తోంది.

వేలల్లో దరఖాస్తులు

చివరిగా 2024 జనవరిలో గత ప్రభుత్వం 4,274 కొత్త పింఛన్లు మంజూరు చేసింది. జూలైలో కొత్తవి మంజూరు రావాల్సి ఉండగా జూన్‌లో కూటమి రాకతో వాటికి బ్రేక్ పడింది. గత ఏడాది జనవరి నుంచి జూన్ నాటికి కొత్త పింఛన్ల కోసం 6,350 దరఖాస్తులు ఆన్‌లైన్ అయ్యాయి. కూటమి ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పింఛన్ల కోసం అర్జీలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 25 వేలకు పైగా పింఛన్ దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్టు అంచనా. సైట్ ఓపెన్‌కాక దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే వీలులేక ఎన్నో వ్యయ ప్రయాసల కోర్చి పేదలు అందజేస్తున్న అర్జీలు ఏమవుతున్నాయో తెలీని పరిస్థితి.

గళమెత్తిన ఉపాధ్యాయులు



కలెక్టరేట్ వద్ద చేపట్టిన ఆందోళనలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోపిమూర్తి

భీమవరం: ఉద్యోగ, ఉపాధ్యాయులకు మేలు చేసేలా ప్రభుత్వ విధానాలుండాలని పీఆర్‌సీ గడువు ముగిసి 21 నెలలు గడిచిపోయినా 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయకపోవడం దారుణమని ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి అన్నారు. ఫ్యాప్టో ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం 9 నెలలు గడిచిపోయిన ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. ఫ్యాప్టో రాష్ట్ర చైర్మన్ ఎల్.సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ కరోనాలోనూ సాధారణంగా చనిపోయిన స్థానిక సంస్థల ఉద్యోగ, ఉపాధ్యాయుల వారసులకు గత ఐదేళ్లనుంచి కారుణ్య నియామకాలు లేక కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫ్యాప్టో చైర్మన్ పిఎస్ విజయరామరాజు, సెక్రటరీ జనరల్ జి.ప్రకాశం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్ డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. వెంటనే పీఆర్‌సీ ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలని, సంఘాలను చర్చలకు ఆహ్వానించాలని జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందచేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో కో–చెర్మన్స్ పి.సాయి వర్మ, ఎస్.శ్రీనివాసరావు, బీవీ నారాయణ, బి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పన్ను పాటలో సాగని ఆట

- కూటమి కార్యకర్తలా మున్సిపల్ కమిషనర్ వ్యవహారం!
- తమ మెడకు చుట్టుకుంటుందనే భయంతో చివరి నిమిషంలో వెనకడుగు
- జనసేన నేతకు మేలు చేసే ప్రయత్నం
- స్వయంగా నరసాపురం ఎమ్మెల్యే బెదిరింపుల పర్వం



నరసాపురం మున్సిపల్ కార్యాలయం(ఫైల్)

నరసాపురం: నరసాపురం మున్సిపల్ మార్కెట్ డైలీ పన్ను వసూళ్ల విషయంలో జనసేన నేతకు మేలు కలిగించేలా, మున్సిపల్ ఆదాయానికి భారీగా గండి పడేలా కూటమి నేతలు వేసిన స్కెచ్ బెడిసికొట్టింది. పైకి నిబంధనల ప్రకారం జరుగుతున్నట్లు చూపించి, గత ఏడాది కంటే ఏకంగా రూ.50 లక్షలకు పైగా తక్కువకు మార్కెట్ పాటను జనసేన నాయకుడికి కట్టపెట్టాలని మున్సిపల్ కమిషనర్ వ్యవహరించిన తీరుపై విమర్శలు వస్తున్నాయి. మున్సిపాలిటీలో వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉంది. అనుకున్న వారికి పాట కట్టబెట్టాలంటే కౌన్సిల్ తీర్మానం అవసరం. ఈ విషయంలో ఎవరైనా కోర్టును ఆశ్రయిస్తే ఇబ్బందనే భయంతో అధికారులు వెనక్కి తగ్గి మళ్లీ పాట నిర్వహించాలని నిర్ణయించారు. మున్సిపాలిటీ ఫుట్‌పాత్‌లు, రోడ్డు మార్జిన్ల వద్ద వ్యాపారాలు చేసే వారి నుంచి రోజువారీ పన్నుల వసూళ్లకు హక్కులు కోసం గతేడాది జరిగిన వేలంపాట రూ.83 లక్షలకు వెళ్లింది. ఈ ఆర్థిక సంవత్సరానికి వారం క్రితం నిర్వహించిన పాటలో ఓ జనసేన నేత తన భార్య గంటా నాగ దుర్గాదేవి పేరున రూ.30,06,000కు పాట దక్కించుకున్నాడు. గత ఏడాదితో పోలిస్తే రూ.50 లక్షలకు పైగా పాట తగ్గింది.

తెరవెనుక చక్రం తిప్పిన ఎమ్మెల్యే

ఎట్టి పరిస్థితుల్లో జనసేన నేతకు మార్కెట్ పాట అప్పగించి, మున్సిపాలిటీ ఆదాయానికి గండి కొట్టేందుకు ముందు నుంచి భారీ స్కెచ్ వేశారు. వేలం పాటకు ముందు మార్కెట్ ప్రాంతంలో వ్యాపారులు నిర్వహించిన సమావేశానికి ఎమ్మెల్యే నాయకర్ వెళ్లి మార్కెట్ పన్ను ఎక్కువ కట్టవద్దని బహిరంగంగా చెప్పారు. దీంతో వేలంపాటదారులు భయపడ్డారు. ఎమ్మెల్యే చెప్పిన మాట ప్రకారం చూసుకుంటే పన్ను వసూళ్లు కష్టమవుతుందని కాంట్రాక్టర్లు భయపడి పాటకు మొగ్గుచూపలేదు. కమిషనర్ తక్కువ మొత్తానికి జనసేన నేతకు పన్ను నిర్వహణ అప్పగించడానికి మున్సిపల్ చట్ట ప్రకారం ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మొత్తం బాధ్యత తనపై వేసుకుని కష్టపడ్డారు. మూడుసార్లు పాట వాయిదా వేసి, నాలుగో సారి జనసేన నేతకు రూ.50 లక్షలు తక్కువకు అప్పగించారు.

కౌన్సిల్ తీర్మానం అవసరంతో చిక్కు

పన్ను వసూళ్ల బాధ్యతలు అప్పగించాలంటే కౌన్సిల్ తీర్మానం అవసరం. మొత్తం 31 మంది కౌన్సిలర్లలో 25 మంది వైఎస్సార్‌సీపీ సభ్యులున్నారు. గత ఏడాది కంటే భారీ మొత్తంలో పాట తగ్గడంపై ఎవరైనా కోర్టును ఆశ్రయిస్తే మొత్తం వ్యవహారం కమిషనర్, మున్సిపల్ రెవిన్యూ అధికారుల మెడకు చుట్టుకోవచ్చని భయపడ్డారు. దీంతో పాటను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని నిర్ణయించారు. రోజూ వసూలు చేసే పన్నులు కొంతమేర తగ్గిస్తామని పైకి వ్యాపారులను మభ్యపెట్టి ఆశలు చూపించి ఏకంగా మున్సిపాలిటీకి మార్కెట్ పాట ద్వారా ఏటా వచ్చే ఆదాయానికి గండికొట్టే ప్రయత్నం చేయడం, అందులో స్వయంగా ఎమ్మెల్యే పరోక్షంగా ప్రయత్నించడం.. ఈ అంశంలో మున్సిపల్ కమిషనర్ నిబంధనలు వదిలి పెట్టడం చర్చనీయాంశమైంది.

ఫిర్యాదులపై అలసత్వం సహించం

జేసీ రాహుల్ కుమార్ రెడ్డి



మాట్లాడుతున్న జేసీ రాహుల్ కుమార్ రెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): పీజీఆర్‌ఎస్ పిటిషన్ల పరిష్కారంపై బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సమీక్షించారు. గత రెండు నెలల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులు అలసత్వం వహిస్తున్నట్లు అనిపిస్తుందని, నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవన్నారు. సమస్యల పరిష్కారంపై జిల్లా అధికారులు కంట్రోల్ రూమ్‌కి వెళ్లి అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి తగు సూచనలు తెలియజేసి సమస్యలు వేగవంతంగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొన్ని శాఖల్లో ఫిర్యాదులు ఎక్కువ పెండింగ్ ఉన్నాయని వాటి పరిష్కారానికి అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరిస్తూ.. తిరిగి మళ్లీ ఫిర్యాదు చేయకుండా నాణ్యమైన పరిష్కారం చూపాలని జాయింట కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డీఆర్‌ఓ మొగిలి వెంకటేశ్వర్లు, గ్రామ, వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి, డ్వామా పీడీ డా. కెసీహెచ్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు ఏర్పాట్లపై సమీక్ష

పాలకోడేరు: రబీ సీజన్ ధాన్యం కొనుగోలులో ఏ విధమైన ఇబ్బందులు లేకుండా వ్యవహరించాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం రబీ సీజన్‌కు సంబంధించి పాలకోడేరు మండలం వ్యవసాయ శాఖ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు నిమిత్తం అన్ని ఏర్పాట్లతో సంసిద్ధంగా ఉండాలన్నారు. ధాన్యం కొనుగోలులో రెండు విషయాలపై సిబ్బందికి దిశ నిర్దేశం చేసి సూచనలు చేశారు. మండలంలోని వ్యవసాయ సహాయకులు, ధాన్యం కొనుగోలు సిబ్బందితో పాటు టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని ధాన్యం కొనుగోలులో ఏ విధమైన ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. రైస్ మిల్లర్ నుంచి సరఫరా చేసే గోనె సంచులను ముందుగా పరిశీలించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ ఎస్.బి.విజయలక్ష్మి, ఎంఏఓ వి.రమణరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ ఆలోచన విరమించుకోవాలి



భీమవరం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నేతలు

భీమవరం: మున్సిపాలిటీల ద్వారా ప్రజలకు అందించే సేవల ప్రైవేటీకరణను ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేసింది. ప్రభుత్వ విధానాన్ని నిరసిస్తూ భీమవరం మున్సిపల్ కార్యాలయం వద్ద బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయు నాయకుడు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారమవుతాయని, ఆశించిన కార్మికుకు చేదు అనుభవం ఎదురవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సేవలను ప్రైవేటుపరం చేస్తే మరింత ఇబ్బంది ఎదురవుతుందన్నారు. మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు నీలాపు రాజు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ దశలవారిగా ఆందోళనకు పిలుపునిచ్చిందని సంతకాల సేకరణ, ప్రదర్శనలు, మంత్రికి వినతి పత్రం అందించడం వంటి పలు కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డికి వినతి పత్రం అందజేశారు.

9న ఉండిలో ఆక్వా రైతుల సమావేశం

భీమవరం: ఆక్వా సమస్యలపై చర్చించడానికి ఈ నెల 9న అప్సడా, ఆక్వా రైతుల సమావేశం ఏర్పాటుచేసినట్లు జిల్లా ఫ్రాన్స్‌ఫార్మర్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.గజపతిరాజు, గాదిరాజు వెంకట సుబ్బరాజు చెప్పారు. బుధవారం భీమవరంలో నిర్వహించిన ఫెడరేషన్ సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల ఆక్వా రంగం అనేక ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న తరుణంలో రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాల్సివుందన్నారు. 9వ తేది ఉదయం 10 గంటలకు ఉండి గ్రామంలోని కోట్ల ఫంక్షన్‌హాల్లో నిర్వహించే సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకానున్నందున ఆక్వా రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు.

తణుకులో ఐటీ దాడులు

తణుకు అర్బన్: ఆదాయపు పన్ను శాఖ అధికారులు బుధవారం తణుకులో ఇద్దరు వ్యాపారులపై దాడులు చేశారు. తణుకు పట్టణానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి కాటూరి లక్ష్మణరావుతోపాటు తణుకు మండలం వేల్పూరు గ్రామానికి చెందిన ఎస్.దుర్గాప్రసాద్ నివాసాలు, కార్యాలయాలపై నిర్వహించిన దాడుల్లో ఇద్దరి నుంచి కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లుగా తెలుస్తోంది. మంగళవారం రాత్రి నుంచి లక్ష్మణరావు నివాసం, కార్యాలయంలో దాడులు నిర్వహించగా బుధవారం దుర్గాప్రసాద్ ఇంటిపై దాడులు నిర్వహించడంతో పలువురు వ్యాపారులు భయాందోళనకు గురయ్యారు.

కూటమి సేవలో ఖాకీలు!

- అత్తిలి ఎంపీపీ ఎన్నికల్లో ఎమ్మెల్యే ఆరిమిల్లి అనుచరుల అరాచకం
- మరుసటి రోజే పోలీసులకు ఫిర్యాదు చేసిన మాజీ మంత్రి కారుమూరి
- వారం రోజులు కావస్తున్నా కేసు నమోదుకు మీనమేషాలు



కారుమూరి ఇంట్లోకి చొచ్చుకెళ్లేందుకు యత్నిస్తున్న కూటమి మూకలు (ఫైల్)

సాక్షి, భీమవరం: అధికార పార్టీకి పోలీసులు వత్తాసు పలుకుతూ వారి విధులు విస్మరిస్తున్నారు. కూటమి మూకల దౌర్జన్యాన్ని ఖండిస్తూ వైఎస్సార్‌సీపీ నేతల ఫిర్యాదుపై వారం రోజులు కావస్తున్నా కేసు నమోదు చేయకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఫిర్యాదు అందినట్టుగా ఎక్‌నాలెడ్జ్‌మెంట్‌తో సరిపెట్టారు. గత నెల 27న అత్తిలి ఎంపీపీ ఎన్నిక సందర్భంగా మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు నివాసం వద్ద వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులను కూటమి మూకలు నిర్బంధించి ఎన్నికలో పాల్గొనకుండా అడ్డుకున్న విషయం తెలిసిందే. ఎంపీటీసీ సభ్యులు ఇంటి నుంచి బయటకు వెళ్లేందుకు వీలులేకుండా రోడ్డుకు అడ్డంగా వాహనాలు పెట్టి మూసివేశారు. దమ్ముంటే తమను దాటి వెళ్లమంటూ అరుపులు, కేకలతో భయానక వాతావరణం సృష్టించారు. ఒకానొక దశలో కారుమూరి ఇంటి గేటును నెట్టుకుంటూ లోపలికి చొరబడే ప్రయత్నం చేశారు. గొడవలు సృష్టించేందుకు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. కూటమి మూకలు చేసిన దౌర్జన్యకాండకు సంబంధించిన వీడియోలు, సీసీటీవీ ఫుటేజీలు రాష్ట్ర వ్యాప్తంగా సంచలమయ్యాయి. ఎన్నిక వాయిదా పడిన మరుసటి రోజు సైతం మండల పరిషత్ కార్యాలయానికి వచ్చే రోడ్లన్నింటిని బ్లాక్ చేసి వైఎస్సార్‌సీపీ సభ్యులు ఉన్నారేమోనని వాహనాలను తనిఖీలు చేయడం సంచలనమైంది. ప్రశాంతతకు నిలయమైన అత్తిలిలో ఇలాంటి ఘటనలు ముందెప్పుడూ చూడలేదంటూ స్థానికులు సైతం భయభ్రాంతులకు గురయ్యారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ అల్లరి మూకలు పెట్రేగిపోయినా పోలీసులు చేష్టలుడిగి చూస్తుండిపోయారే తప్ప వారిని అడ్డుకునే ప్రయత్నం చేయలేదు. ఎన్నికల్లో పాల్గొనేందుకు తమ సభ్యులకు రక్షణ కల్పించాలని స్వయంగా మాజీ మంత్రి కారుమూరి తణుకు రూరల్ సీఐ కృష్ణకుమార్, ఎస్ఐ ప్రేమరాజు, ఇతర ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందించలేదు.

వారం రోజులైనా కేసు లేదు

ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అనుచరులు సాగించిన దౌర్జన్యంపై అదే రోజున మాజీ మంత్రి కారుమూరి అత్తిలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే ఆదేశాలతో ఆయన అనుచరులు మారణాయుధాలతో తన ఇంటిపై దాడికి తెగబడ్డారని, మహిళ ఎంపీటీసీ సభ్యుల పట్ల అసభ్యంగా ప్రవర్తించారని, తమ సభ్యులు ఎన్నికలకు వెళ్లకుండా అడ్డుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దాడికి సంబంధించి సీసీ ఫుటేజ్, మీడియా కవరేజ్ వివరాలను పెన్‌డ్రైవ్‌లో పెట్టి పోలీసులకు అందజేశారు. వారం రోజులు కావస్తున్నా చర్యలు తీసుకోకుండా జిల్లా పోలీసులు కాలయాపన చేస్తుండటంపై కారుమూరి డీజీపీ దృష్టికి తీసుకువెళ్లడంతో ఎట్టకేలకు తమకు ఫిర్యాదు అందినట్టుగా మంగళవారం రాత్రి అత్తిలి పోలీసులు రసీదు అందజేశారు. కేసు విషయమై అత్తిలి ఎస్ఐ పి.ప్రేమరాజు వివరణ కోరగా ఫిర్యాదు అందిందని, విచారణ చేస్తున్నామని తెలిపారు.

క్లుప్తంగా

మెప్మాకు గిన్నిస్ బుక్ రికార్డ్స్



గిన్నిస్ బుక్, వరల్డ్ రికార్డ్స్ సర్టిఫికెట్లను కలెక్టర్‌కి చూపుతున్న మెప్మా అధికారులు

భీమవరం (ప్రకాశంచౌక్): రాష్ట్రవ్యాప్తంగా 1.50 లక్షల స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులను ఓఎన్‌డీసీ ప్లాట్‌ఫారమ్ ద్వారా విక్రయించి గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌ను సాధించడం అభినందనీయమని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. జిల్లా మెప్మా అధికారులు గిన్నిస్ బుక్ రికార్డ్స్, వరల్డ్ రికార్డ్స్ సర్టిఫికెట్లతో బుధవారం కలెక్టర్‌ను కలిశారు. ఓఎన్‌డీసీ విక్రయాల్లో జిల్లా ఎస్‌హెచ్‌జీల భాగస్వామ్యం 6,500గా ఉందని మెప్మా అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ఓఎన్‌డీసీ విక్రయాల్లో జిల్లా భాగస్వామ్యం పెద్ద మొత్తంలో పెరగాలని సూచించారు. కార్యక్రమంలో మెప్మా జిల్లా లైవ్లీహుడ్స్ స్పెషలిస్ట్ సీహెచ్ నానిబాబు, జిల్లా ఐబీ గ్రంధి పార్వతి, జిల్లా ఈ మార్కెట్ స్పెషలిస్ట్ సీహెచ్ మోహన్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మోటార్‌సైక్లిస్టు మృతి

నరసాపురం రూరల్: వెనుక నుంచి మరో మోటార్‌సైకిల్ ఢీకొనడంతో మోటార్‌సైక్లిస్ట్ మృతి చెందాడు. నరసాపురం – పాలకొల్లు రహదారిలో చిట్టవరం పెద్దపుంత సమీపంలో జాతీయరహదారిపై బుధవారం ఈ ఘటన చోటుచేసకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చిట్టవరం గ్రామానికి చెందిన కట్టా నవరత్నం (బాషా) (22) బైక్‌పై పాలకొల్లు వైపు వెళుతుండగా పుంత రోడ్డు వద్దకు వచ్చేసరికి వెనుకనుంచి పాలకొల్లు వైపే వస్తున్న మరో బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో బాషా తలకు బలమైన గాయాలు కావడంతో నరసాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ప్రమాదంలో మరో బైక్‌పై ప్రయాణిస్తున్న యువకుడికి కూడా గాయాలు కావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడి తండ్రి కట్టా పెద్దిరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్సై టి వెంకట సురేష్ తెలిపారు.

వేసవిలో ఐఆర్‌సీటీసీ టూర్ ప్యాకేజీలు

ఏలూరు (టూటౌన్): వేసవిలో పలు సమ్మర్ స్పెషల్ టూరిస్ట్ ట్రైన్ ప్యాకేజీలు అందుబాటులోకి తెచ్చినట్లు ఐఆర్‌సీటీసీ విజయవాడ ఏరియా మేనేజర్ ఎం.రాజా ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్యాకేజీ నం.1లో భాగంగా సప్త జ్యోతిర్లింగాల యాత్రను ఈనెల 8వ తేదీ నుంచి 19వ తేదీ వరకు నిర్వహిస్తున్నామన్నారు. యాత్రలో భాగంగా ఉజ్జయిని, ద్వారక, సోమనాథ్, పూనే, నాసిక్, ఔరంగాబాద్ సందర్శించవచ్చునన్నారు. టికెట్ వెల రూ.18,510గా నిర్ణయించడం జరిగిందన్నారు. ప్యాకేజీ నం.2లో భాగంగా హరిద్వార్ – రిషీకేష్ – వైష్ణవోదేవి యాత్ర 23న ప్రారంభమై మే 2వ తేదీ వరకు జరుగుతుందని, టికెట్ ధర రూ.18,510 అని తెలిపారు. ప్యాకేజీ నం.3లో భాగంగా వచ్చే నెల 8 నుంచి 17వ తేదీ వరకు కాశీ – గయా – ప్రయాగ్ – అయోధ్య యాత్ర, టికెట్ ధర రూ.16,800, ప్యాకేజీ నం.4లో భాగంగా వచ్చే నెల 22 నుంచి 30వ తేదీ వరకు అరుణాచలం – మధురై – రామేశ్వరరం యాత్ర, టికెట్ ధర రూ.14,700, ప్యాకేజీ నం.5లో భాగంగా జూన్ 4 నుంచి జూన్ 12 వరకు పంచ జ్యోతిర్లింగ యాత్ర, ఈ యాత్రలో మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్, త్రయంబకేశ్వర్, భీమేశ్వర్, గిరిష్‌నేశ్వర్, ఎల్లోరా, మోహ్, నాగపూర్ క్షేత్రాలు సందర్శించవచ్చునన్నారు. టికెట్ ధర రూ.14,700గా నిర్ణయించడం జరిగిందన్నారు. వివరాలకు విజయవాడలోని ఐఆర్‌సీటీసీ కార్యాలయం లేదా 92814 95848, 92810 30714 నంబర్లలో సంప్రదించాలని ఏరియా మేనేజర్ తెలియజేశారు.

ముమ్మరంగా దాళ్వా మాసూళ్లు

- జిల్లాలో 2.15 లక్షల ఎకరాల్లో దాళ్వా వరిసాగు
- అనుకూల వాతావరణంతో దిగుబడులపై ఆశలు
- 6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు ప్రభుత్వ లక్ష్యం
- నేడు తాడేపల్లిగూడెంలో కొనుగోలు కేంద్రం ప్రారంభం



వీరవాసరం మండలం తోకలపూడిలో జరుగుతున్న దాళ్వా మాసూళ్లు

భీమవరం: అవరోధాలను అధిగమించి ఆరుగాలం కష్టించి దాళ్వా సాగుచేసిన రైతన్నలు పంట మాసూళ్ల పనుల్లో నిమగ్నమయ్యారు. సాగునీటి కొరత, తెగుళ్లు, ఎలుకల బెడదతో ఇబ్బందులు పడ్డా వాతావరణం అనుకూలించడంతో దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని ఆశిస్తున్నారు. ఇప్పటికే తాడేపల్లిగూడెం, వీరవాసరం, పెంటపాడు, తణుకు, పాలకొల్లు వంటి ప్రాంతాల్లో రైతన్నలు దాళ్వా మాసూళ్లు ప్రారంభించగా పీఆర్–126, ఎస్ఎల్–10 వంటి వరి రకాల కొట్టు పొట్టు ధాన్యం ఎకరాకు 60 నుంచి 70 బస్తాల వరకు దిగుబడి వస్తున్నట్లు చెబుతున్నారు. జిల్లాలోని 20 మండలాల పరిధిలో సుమారు 2.15 లక్షల ఎకరాల్లో దాళ్వాసాగు చేయగా కొన్ని ప్రాంతాల్లో మాసూళ్లు ప్రారంభించారు.

సాగునీటి కొరత, తెగుళ్ల బెడద

దాళ్వా సాగు ప్రారంభం నుంచి కొన్ని ప్రాంతాల్లో సాగునీటి సమస్య ఉత్పన్నం కావడంతో వంతుల వారీ విధానంలో నీరందించడానికి ప్రభుత్వ యంత్రాంగం ప్రణాళిక సిద్ధం చేసింది. అయినప్పటికీ మెరక ప్రాంతాలకు సాగునీరు సక్రమంగా అందకపోవడంతో రైతులు మురుగు కాలువల్లోని నీటిని ఆయిల్ ఇంజిన్ల సహాయంతో చేలకు పెట్టుకుని పంటను కాపాడుకున్నారు. అలాగే తెగుళ్లు, ఎలుకల బెడదతో ఇబ్బందులు పడ్డారు.

6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం

దాళ్వా పంటలో జిల్లా వ్యాప్తంగా 6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులు నిర్ణయించారు. దీనికిగాను 348 రైతు సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. రైతుసేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలుకు ఇప్పటికే రెవెన్యూ డివిజన్ల వారీగా సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. కొనుగోలు కేంద్రాల్లో 17 శాతం తేమ ఉన్న ధాన్యం కొనుగోలులో సాధారణ రకం క్వింటాళ్ల ధాన్యం రూ.2,300, ఏ గ్రేడ్ రకం రూ.2,320 రైతులకు చెల్లిస్తారు. పంట మాసూళ్లు ప్రారంభం కావడంతో జిల్లాలో మొట్టమొదటి రైతు సేవాకేంద్రాన్ని గురువారం తాడేపల్లిగూడెంలో ప్రారంభించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు.

80 శాతం గింజలు గట్టిపడితే మాసూళ్లు చేయాలి



జిల్లా వ్యాప్తంగా దాళ్వా వరి పంట ఆశాజనకంగా ఉంది. ఇప్పుడిప్పుడే కొన్ని ప్రాంతాల్లో మాసూళ్లు ప్రారంభమయ్యాయి. వాతావరణం అనుకూలంగా ఉండడంతో 80 శాతం గింజలు గట్టిపడిన తరువాతనే మాసూళ్లు చేయాలి. 6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వం లక్ష్యం. – జెడ్ వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, భీమవరం

ఉపాధి పనులు పారదర్శకంగా జరగాలి



బొండాడపేటలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ప్రాజెక్ట్ డైరెక్టర్ అప్పారావు

కాళ్ల: కాళ్ల మండలం బొండాడపేట గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కేసీహెచ్ అప్పారావు బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. దీనిలో భాగంగా గ్రామ పంచాయతీకి సంబంధించిన పశువుల చెరువు పూడికతీత పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈసందర్భంగా కూలీలతో మాట్లాడి మస్టర్ రికార్డులను పరిశీలించారు. 3,307 పనిదినాలు అంచనాతో రెండు ఎకరాల విస్తీర్ణం ఉన్న ఈ చెరువులో సుమారు రూ.10 లక్షలతో చేపట్టిన పనులు పారదర్శకంగా జరగాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.స్వాతి, ఏపీఓ కె.శ్రీనివాసరావు, సర్పంచ్ గుడ్ల మధుసూదనరావు, టెక్నికల్ అసిస్టెంట్ వీవీ మణికంఠ, ఫీల్డ్ అసిస్టెంట్ నాగలక్ష్మి పాల్గొన్నారు.

జనసేన నాయకులపై చర్యలేవి?

- వేణు, చిన్నిలను కాపు కాస్తున్న కూటమి
- మహిళలను ఇబ్బందిపెడితే తాటతీస్తా అన్న పార్టీ సిద్ధాంతాలివేనా అంటున్న జనం



దువ్వలో ఓ ప్రైవేటు కార్యక్రమంలో మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే రాధాకృష్ణల పక్కన ఉన్న వేణు, చిన్ని (ఫైల్)

తణుకు అర్బన్: జనసేన నాయకులు తనను గదిలో నిర్బంధించి ఇష్టానుసారంగా దుర్భాషలాడారని చావే శరణ్యం అంటూ పోలీసులను ఆశ్రయించిన దువ్వ గ్రామ సచివాలయ బిల్లు కలెక్టర్ నీలం వెంకటలక్ష్మి వ్యవహారం రోజురోజుకీ వేడెక్కుతోంది. ఇప్పటికే ఎస్సైకి డబ్బులు కొట్టాం.. సెక్షన్‌లు తీసిపడేశారు.. అన్న ఆడియో నెట్టింట వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. ఈనెల 28న దువ్వ పంచాయతీ కార్యాలయంలో జరిగిన ఘటనపై అదే రోజు తణుకు రూరల్ పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేశారు. అయినా పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదంటూ బాధితురాలు ఈనెల 1న మంగళగిరిలోని జనసేన కార్యాలయానికి వెళ్లి జనవాణిలో దువ్వ జనసేన నాయకులు వేణు, చిన్నిలపై ఫిర్యాదు చేశారు. ఏ ఇబ్బంది లేకుండా చూస్తామని చెప్పారేకానీ జనసేన నాయకులపై ఎటువంటి క్రమశిక్షణ చర్యలు తీసుకోలేదంటూ బాధితురాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతనెల 31న జిల్లా ఎస్పీకి ఫోన్‌లో ఫిర్యాదుచేయగా ఎస్సై సచివాలయానికి వచ్చి విచారణ చేశారని, సీసీ ఫుటేజీ ఇప్పించమంటూ దరఖాస్తు చేశారని బాధితురాలు చెబుతున్నారు.

కూటమి నేతల అండదండలు

జనసేన నాయకుల తీరు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయినా కూటమి నేతలు అండగా నిలవడం వివాదాస్పదంగా మారింది. మహిళలపై అసభ్యంగా ప్రవర్తిస్తే తాటతీస్తా అనే పార్టీ పట్టించుకోకపోగా, టీడీపీ శ్రేణులు కూడా వత్తాసు పలకడం గమనార్హం. ఇదిలా ఉండగా దువ్వలో ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణల పక్కనే వేణు, చిన్నిలను కూర్చోపెట్టుకోవడంతో వారికి ఇస్తున్న ప్రాధాన్యతపై ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఇంటి చుట్టూ రెక్కీ..

తన ఇంటి చుట్టూ వేణు, చిన్ని అనుచరులు రెక్కీ నిర్వహిస్తున్నారని బాధితురాలు వెంకటలక్ష్మి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జనసేన నాయకుల నుంచి ప్రాణహాని ఉందని భయపడుతున్నారు. వారి అనుచరులు ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ హల్‌చల్ చేస్తున్నారని అవి కూడా వీడియోలు సేకరించానని, పోలీసులకు ఇవ్వనున్నట్టుగా స్పష్టం చేశారు. తనకు అండగా ఎవరూ లేకుండాపోయారని, ఎవరూ వెళ్లకూడదని జనసేన నాయకులు ఆంక్షలు విధిస్తున్నారని, రాజకీయ ఇబ్బందుల దృష్ట్యా ఉద్యోగుల సంఘం కూడా ముందుకు రాలేదంటూ వాపోయారు.

పోలీసుల క్లాస్

ఎస్సైకి డబ్బులు కొట్టాం.. సెక్షన్‌లు తీసిపడేశారు.. అని జనసేన మండల అధ్యక్షుడు చిక్కాల వేణు అన్నట్లుగా ఆడియో వైరల్ అవడంపై తణుకు రూరల్ పోలీసులు వేణు, చిన్ని ఇద్దరికీ క్లాస్ పీకినట్టుగా సమాచారం. ఈ ఘటనపై తణుకు రూరల్ ఎస్సై చంద్రశేఖర్‌ను 'సాక్షి' వివరణ కోరగా బాధితురాలి ఫిర్యాదు ప్రకారం కేసు నమోదు చేశామని, చిక్కాల వేణు, శ్రీరాములు చిన్నిలకు 41 నోటీసులు జారీచేశామని చెప్పారు.

జామాయిల్ తోటలో అగ్నిప్రమాదం



రాళ్లకుంటలో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ద్వారకాతిరుమల: రాళ్లకుంటలో ఇటీవల నరికివేసిన జామాయిల్ తోటలో బుధవారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. భీమడోలు అగ్నిమాపక సిబ్బంది సకాలంలో మంటలను ఆర్పివేయడంతో పెనుముప్పు తప్పింది. స్థానికుల కథనం ప్రకారం. రాళ్లకుంటలోని సెయింట్ గ్జేవియార్ పాఠశాలకు చెందిన జామాయిల్ తోటను కొద్దిరోజుల క్రితం నరికివేశారు. కలపను తరలించగా, మిగిలిన తుక్కు మొత్తం అక్కడే ఉంది. గుర్తు తెలియని వ్యక్తుల కారణంగా ఆ తుక్కుకు నిప్పు అంటుకుంది. ఒక్కసారిగా మంటలు ఎగసిపడటంతో పాటు, చుట్టుపక్కలకు వ్యాపించాయి. దాంతో పరిసర ప్రాంత రైతులు ఆందోళన చెందారు. సమాచారం అందుకున్న భీమడోలు అగ్నిమాపక ఎస్సై జి.నాగరాజు సిబ్బందితో కలసి హుటాహుటీన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేయడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు తాగి పడవేసిన సిగిరెట్ కారణంగానే ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు.

చెల్లని చెక్కు కేసులో జైలు, జరిమానా

నూజివీడు: చెల్లని చెక్కు ఇచ్చిన నేరానికి నిందితుడికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.12 లక్షల జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు నూజివీడు మండలం సీతారామపురంనకు చెందిన కన్నెకంటి సాంబశివరావు కృష్ణాజిల్లా బాపులపాడు మండలం సేరినరసన్నపాలెంకు చెందిన బల్లా సత్యన్నారాయణకు 2020 జులై 6న రూ.12,44,000 నగదును అప్పుగా ఇచ్చాడు. కొంత కాలం తరువాత సాంబశివరావు బాకీ తీర్చమని అడగగా 2021 జులై 5న రూ.10 లక్షలకు సత్యన్నారాయణ చెక్కు ఇచ్చాడు. సాంబశివరావు చెక్కును బ్యాంకులో వేయగా నగదు లేక తిరస్కరణకు గురైంది. దీంతో కోర్టును ఆశ్రయించగా విచారణ అనంతరం సత్యన్నారాయణకు ఆరు నెలల జైలు శిక్ష, రూ.12 లక్షల జరిమానా విధిస్తూ కోర్టు తీర్పును వెలువరించింది.

మెట్ట.. నీటికి కటకట!

- ఎండిన ఆంధ్రా, ఎర్ర కాలువలు
- వట్టిపోతున్న బోర్లు.. అడుగంటిన బావులు
- వేసవిలో నీటి ఎద్దడి తలెత్తే ప్రమాదం



పూర్తిగా ఎండిపోయిన ఎర్రకాల్వ



ప్రగడవరం సమీపంలో ఎండిపోయిన చెరువు

చింతలపూడి: భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో ఈ వేసవిలో నీటి ఎద్దడి తలెత్తే ప్రమాదముంది. చెరువులు ఎండిపోయే దశకు చేరుకోగా బోర్లు, బావులు ఇప్పటికే అడుగంటిపోయాయి. ఈ పరిస్థితుల్లో మెటప్రాంత ప్రజానీకం తాగు, సాగునీటికి కటకటలాడే పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉండడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. చింతలపూడి నియోజకవర్గంలో వేలాది ఎకరాలకు సాగునీరు అందించే అంధ్రా కాల్వ ఎండిపోయింది. ఎర్రకాల్వలు కూడా పూర్తిగా ఎండిపోయాయి. నియోజకవర్గంలో ఉన్న 450కి పైగా చెరువులు, కుంటలు ఏటా మేనెల వచ్చేసరికి నీరు ఇంకిపోతుంటాయి. అయితే ఈ ఏడాది మాత్రం ముందుగానే చెరువులు వట్టి పోయే ప్రమాదం ఏర్పడింది.

ఆక్రమణలతో హరించుకుపోతున్న చెరువులు

గత ఏడాది డిసెంబర్ నెల నుంచి వర్షాలు పడకపోవడం, చెరువులు ఎండిపోవడానికి ఒక కారణమైతే, రైతులు దాళ్వా పంటలు వేయడం కూడా మరో కారణంగా చెప్తున్నారు. చింతలపూడి సబ్‌డివిజన్‌లో ఈ ఏడాది 8,228 ఎకరాల్లో రైతులు రబీ వరి సాగు చేపట్టారు. వీటికి తోడు చెరువుల ఆక్రమణలు కారణంగా కూడా నీరు నిల్వ చేసుకోలేని పరిస్థితి ఏర్పడింది. అధికార యంత్రాంగం ఏమీ పట్టనట్టు చోద్యం చూస్తుండటంతో ఆక్రమణలతో చెరువులు హరించుకుపోతున్నాయి. ఫలితంగా ఏటా వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడుతోంది. చెరువుల్లో నీరు ఎండిపోతుండటంతో పశువులకు తాగునీరు ఎలా అన్నదే ప్రస్తుతం రైతులను పట్టి పీడిస్తున్న సమస్య. మెట్టకు శాశ్వత సాగునీటి వసతి లేకపోవడం, కేవలం వర్షాలపైనే ఆధారపడ్డ చెరువులవల్ల ప్రతి ఏటా మనకు ఈ దుస్థితి ఏర్పడుతోందని ప్రజలు, రైతులు ఆరోపిస్తున్నారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి



చెరువుల్లో నీరు ఎండిపోవడంతో ప్రభుత్వం పశువుల తాగునీటికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి. చెరువుల సమగ్ర సర్వే చేపట్టి ఆక్రమణలో ఉన్న చెరువులకు విముక్తి కలిగించాలి. ఉపాధిహామీ నిధులతో చెరువుల పూడికను పూర్తి స్థాయిలో తీయిస్తే వర్షాకాలంలో చెరువుల్లో నీరు నిల్వ చేసుకోవచ్చు. – దొంతా కృష్ణ, రైతు సంఘం నాయకుడు, రేచర్ల

గోదావరి జలాలను మళ్లించాలి



ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోయిన రైతుల సమస్యలను పరిష్కరించి చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి మెట్ట ప్రాంతానికి గోదావరి జలాలను మళ్లించాలి. తద్వారా రైతులకు శాశ్వత సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించాలి.
– ఎస్‌కే కాలేష, రైతు సంఘం నాయకుడు, చింతలపూడి

'శశి'లో అవగాహన సదస్సు



వేలివెన్ను శశి క్యాంపస్‌లో మాట్లాడుతున్న చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్

ఉండ్రాజవరం: పిల్లల భవిష్యత్తుకు శశి విద్యా సంస్థ భరోసా ఇస్తుందని చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ అన్నారు. మండలంలో వేలివెన్ను శశి క్యాంపస్‌లో 6, 7, 8, 9, 10, 10+1లో ప్రవేశం పొందేందుకు వచ్చిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఐఐటీ, జేఈఈ అడ్వాన్స్‌డ్ మెయిన్, నీట్ విద్యపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ తమ విద్యా సంస్థలో 6వ తరగతి నుంచి ఐఐటీ, నీట్ విద్యపై ఫౌండేషన్ కోర్సు ప్రారంభించడం వలన ఎంతో పోటీ ఉన్నప్పటికీ తమ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా నూతన విద్యా విధానాన్ని వివరించారు. వైస్ చైర్మన్ లక్ష్మీసుప్రియ మాట్లాడుతూ శశి హాస్టల్‌లో విద్యార్థుల భోజన వసతులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు. అకడమిక్ డైరక్టర్లు మన్నె వెంకటేశ్వరరావు, చిట్టూరి శేషుబాబు పాల్గొన్నారు.

భర్త అంత్యక్రియలను అడ్డుకున్న భార్య

- తన భర్తను హత్యచేశారని ఆరోపణ
- విచారణ జరిపించాలని పోలీసులకు ఫిర్యాదు

తాడేపల్లిగూడెం అర్బన్ : భర్త అంత్యక్రియలను శ్మశాన వాటికలో అడ్డుకుంది ఓ భార్య. తన భర్త అనారోగ్యంతో మరణించలేదని, హత్య చేశారని.. నిజానిజాలు వెలికితీయాలని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై బాదం శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం తాడేపల్లిగూడెం గొల్లగూడెం సెంటర్‌కు చెందిన కలగాని సతీష్, స్వాతిలకు 2009లో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు. భార్యభర్తల మధ్య వివాదాలు చోటు చేసుకోవడంతో కొంతకాలంగా విడిగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో కలగాని సతీష్ తన తలిదండ్రుల వద్ద ఉంటున్నాడు. కిడ్నీ వ్యాధితో బాధపడుతూ పలు ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకున్న సతీష్ ఇటీవల రాజమ్రండి జీఎస్ఎల్ ఆసుపత్రిలో వైద్యం పొందుతూ ఈనెల 1వతేదీ రాత్రి మరణించాడు. అతని మృతదేహానికి సోదరులు తాడేపల్లిగూడెంలోని హిందూ రుద్రభూమి నందు బుధవారం దహన సంస్కారాలు నిర్వహిస్తుండగా మృతుడి భార్య స్వాతి అక్కడకు వచ్చి అడ్డుకుంది. తన భర్త అనారోగ్యంతో చనిపోలేదని, హత్య చేసి హడావిడిగా దహనం చేస్తున్నాని, విచారణ జరిపించాలని పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పట్టణ ఎస్సై బాదం శ్రీనివాస్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం సతీష్ మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

వ్యవసాయంలో శాస్త్ర సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

ఏలూరు (మెట్రో): మారుతున్న కాలానికనుగుణంగా వస్తున్న శాస్త్ర సాంకేతికతను అందిపుచ్చుకుని వ్యవసాయ రంగంలో అమలు చేయడం ద్వారా అధిక దిగుబడులను సాధించాలని ఎన్‌జీ రంగ విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివనారాయణ అన్నారు. ఏలూరులోని ఏరువాక కేంద్రంలో మార్టేరు వ్యవసాయ పరిధిశోధనా స్థానం సహ సంచాలకులు డా. టి.శ్రీనివాస్ అధ్యక్షతన జిల్లా స్థాయి సమన్వయ సంఘ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డా. జి.శివనారాయణ మాట్లాడుతూ సార్వా, దాళ్వా పంటకాలానికి గాను ఏరువాక కేంద్రం, వ్యవసాయ శాఖ, రైతు సేవా కేంద్రం సిబ్బందికి ముసుపు శిక్షణా కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం రైతులు మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో ఏరువాక కేంద్రంతో పాటు కృషి విజ్ఞాన కేంద్రం, రెండు మట్టి నమూనా పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఏలూరు జిల్లా వ్యవసాయ అధికారి షేక్ భాషా, ఏరువాక కేంద్రం, ఏలూరు సమన్వయ కర్త డా. కె.ఫణికుమార్, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, మార్టేరు ప్రధాన శాస్త్రవేత్త డా.సీహెచ్. శ్రీనివాసు, మొక్కజొన్న పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త, అధిపతి డా. కె.మోహనరావు, ఏరువాక కేంద్రం, ఏలూరు శాస్త్రవేత్త ఎస్.నాగేంద్ర బాబు, రైతు శిక్షణా కేంద్రం ఏడీఏ లలిత సుధ, శ్రీనివాస్, రాజకుమార్, కరణ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

105 మందికి రక్త పరీక్షలు



లయన్స్ ఆధ్వర్యంలో రక్త పరీక్షలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో జనతా ట్రస్ట్ నిర్వహణలో అధ్యక్షుడు వీపీఎస్ లక్ష్మీనారాయణచే బుధవారం స్థానిక కడకట్లలోని జనతా ట్రస్ట్ ఆసుపత్రి వద్ద ఉచిత షుగర్ రక్తపరీక్షల శిబిరం నిర్వహించారు. దాత కొత్త సూర్య రమేష్ సహకరించారు. శిబిరంలో 105 మంది రక్త పరీక్షలు చేయించుకున్నారు. శిబిరాన్ని ఆర్యవైశ్య సంఘం ప్రెసిడెంట్ కార్లేపర శ్రీరామచంద్రమూర్తి ప్రారంభించారు. కార్యదర్శి చిన్నం జగదీష్, కోశాధికారి భీమవరపు మహాలక్ష్మి, జనతా వైద్యులు ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, వంగపండు రామ్మోహన్‌రావు, సన్నిధి సూర్యనారాయణమూర్తి, కొండూరి శ్రీరామచంద్రమూర్తి, యర్ర ఆంజనేయ స్వామి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

గ్లోబల్ సపోర్ట్ ఆర్గనైజేషన్ సేవలు అభినందనీయం



ఆర్గనైజేషన్‌చే వృద్ధాశ్రమానికి బియ్యం పంపిణీ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): గ్లోబల్ సపోర్ట్ ఆర్గనైజేషన్ ఫౌండర్ చెన్నా త్రికాల సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఆర్గనైజేషన్ తరుపున ట్రస్టీ జనార్దానరావు (వైఎస్సార్ సీపీ నాయకులు) ఆధ్వర్యంలో బుధవారం జీవన సంధ్య వృద్ధాశ్రమానికి 200 కేజీలు, లార్డ్ ఆఫ్ లైఫ్ చిల్డ్రన్ హోమ్‌కు 150 కేజీలు, అదే విధంగా నిడదవోలు లెపర్సీ కాలనీ వారికి 300 కేజీలు అందజేశారు. దాత వాణి సహకరించారు. వలంటీర్లు దుర్గాప్రసాద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో చలివేంద్రం ఏర్పాటు



తణుకు రైల్వే స్టేషన్‌లో చలివేంద్రం ప్రారంభించిన రోటరీ క్లబ్ ప్రతినిధులు

తణుకు అర్బన్: తణుకు రైల్వే స్టేషన్ 1వ నంబరు ప్లాట్ ఫారమ్‌పై తణుకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. రోటరీక్లబ్ సీనియర్ నాయకులు మల్లిన అరుణసారధి ఆర్థికసాయంతో చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు క్లబ్ అధ్యక్షుడు ఆనందరం మస్తాన్‌రావు తెలిపారు. రైల్వే సూపరింటెండెంట్ వై.నాగరాజు, రోటరీ క్లబ్ ప్రతినిధులు కఠారి సిద్ధార్థ, గమిని రాంబాబు, అక్కెన కాశీ, ప్రగతి రాజా, కె.సత్యనారాయణరాజు, రెడ్డి రంగారావు, బోడపాటి ప్రసాద్, పవన్ కుమార్, ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు



కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: వివిధ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలకు మండలంలో 169 యూనిట్లకు గాను 1493మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారికి బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. తొలి రోజు 434మందికి గాను 240మంది ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఎంపీడీవో విశ్వనాథ్ తెలిపారు. చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు, ఎస్‌బీఐ, బ్యాంకు ఆఫ్ బరోడా, యూనియన్ బ్యాంకు తదితర బ్యాంకులకు చెందిన మేనేజర్లు పాల్గొన్నారు.

రీ -సర్వేకు ప్రజలు సహకరించాలి

పెంటపాడు: ప్రభుత్వం చేపట్టిన రెండో విడత రీ సర్వేకు ప్రజలు, రైతులు తప్పక సహకరించి, అభ్యంతరాలను 40రోజులలో తెలియజేయాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కోరారు. బి.కొండేపాడు, విప్పర్రు గ్రామాల్లో రెండో విడత రిసర్వే గ్రామ సభలు తహసిల్దార్ సీతారత్నం ఆధ్వర్యంలో బుధవారం ఆయన విప్పర్రులో సదస్సు నిర్వహించారు.

నేటి నుంచి గ్రామాల్లో మొబైల్ ఆధార్ క్యాంపులు

అత్తిలి: మండలంలో ఈనెల 3 నుంచి ఆధార్ మొబైల్ క్యాంపులు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో పి శామ్యూల్ తెలిపారు. ఈనెల 3, 4 తేదీలలో లక్ష్మీనారాయణపురం, పాలి, తిరుపతిపురం గ్రామాల్లో 8,9 తేదీలలో ఉనికిలి, ఉరదాళ్లపాలెం, వరిఘేడు గ్రామాల్లో ఆధార్ క్యాంపులు జరుగుతాయని ఎంపీడీవో చెప్పారు.

సాకారం కాని బోట్ క్లబ్

- ఆక్రమణ చెరలో కొండయ్య చెరువు
- బోట్ క్లబ్ సాధ్యమేనా!

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో పెద్ద పెద్ద చెరువులు ఉన్నప్పటికి వాటిని పూడ్చడం, చెరువుల విస్తీర్ణం తగ్గించడం, కొన్నిచోట్ల వాటిని నిరుపయోగంగా మార్చడం జరిగింది. పిల్లలు, పెద్దలు బోటింగ్ చేసేందుకు, నీటి దగ్గర సమయం గడిపేందుకు ఎటువంటి నిర్దిష్టమైన ప్రణాళికలు చేపట్టలేదు.

కడకట్ల కొండయ్య చెరువు ఎంపిక

ఈ క్రమంలో ఎట్టకేలకు పట్టణ సుందరీకరణలో భాగంగా పిల్లలు, పెద్దలు ఆహ్లాదం కోసం బోట్ క్లబ్‌ను ఏర్పాటు చేసేందుకు గతంలోనే నిర్ణయించారు. ఇందుకు గాను ఎక్కువ విస్తర్ణీంలో ఉన్న కడకట్ల కొండయ్య చెరువు ప్రాంతాన్ని ఎంపిక చేశారు. ఏ ముహూర్తాన్ని ప్రారంభమైందో కాని ఆ పనులు ఎక్కడకి అక్కడే నిలిచిపోయాయి.

కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా..

వివరాలలోకి వెళ్లితే స్థానిక కడకట్లలోని కొండయ్య చెరువును ఆధునీకరించి బోట్ క్లబ్ ఏర్పాటు చేసేందుకు దివంగత మాజీ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు నిర్ణయించారు. ఓఎన్‌జీసీ సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) సామాజిక బాధ్యతలో భాగంగా అందించిన నిధులతో ఈ కార్యక్రమం చేపట్టారు. శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఇందులో భాగంగా చెరువులోని పూడికను తీశారు. అదే విధంగా చెరువు చుట్టూ గట్టులను పటిష్టం చేసేందుకు వాల్‌తో సిమ్మెంట్ పనులు చేశారు. ఈ పనులు కారణంగా విశాలమైన చెరువు కాస్త చెరువు విస్తీర్ణం బాగా తగ్గింది. ఏర్పాట్లు పూర్తి అవుతున్న సందర్భంలో అనంతరం జరిగిన రాజకీయ పరిణామాలు నేపథ్యంలో బోట్ క్లబ్ పనులు ఎక్కడవి అక్కడే నిలిచిపోయాయి. నేడు బోట్ క్లబ్ పనులు కొనసాగుతాయా లేదా అనేది ప్రశ్నార్థకంగా మారింది.



కడకట్ల కొండయ్య చెరువు



రాళ్లు రప్పలతో కడకట్ల కొండయ్య చెరువు



కొండయ్య చెరువు వాల్ కట్టిన వద్ద వ్యర్థాలు



కొండయ్య చెరువు ప్రారంభంలో ఆక్రమణలు



కొండయ్య చెరువు చుట్టూ పిచ్చిమొక్కలు

బోట్ క్లబ్ ఏర్పాటు చేయండి



పిల్లలు, యువతీ, యువకులు, పెద్దలు ఆహ్లాదం కోసం, ఆనందం కోసం పట్టణంలో అన్ని హంగులతో కూడిన బోట్ క్లబ్ ఏర్పాటు చేయాలి. సెలవులు సమయంలోను, వేసవి సెలవులలోను బోట్ క్లబ్ ఉంటే ఎంతో ఉపయుక్తం. ఆ దిశగా పాలకులు, అధికారులు, స్వచ్ఛంధ సేవా సంస్థలు కృషి చేయాలి.

– ఎస్.ఎం.సుభాని, తాడేపల్లిగూడెం

అపరిశుభ్ర పరిసరాలు

కొండయ్య చెరువులో నేడు కలువ పువ్వులు, గడ్డి మొక్కలు పెరిగాయి. మురుగు నీరు, పాకుడు కట్టి పచ్చగా కనిపిస్తోంది. కట్టిన వాల్ నేడు శిథిలావస్థకు చేరుతుంది. పనులు ఆగిపోవడంతో చెరువు నాలుగు వైపుల ఉన్న గట్లు అపరిశుభ్రత పరిసరాలు కానవస్తున్నాయి. ఉపయోగం లేని చెట్లు, పిచ్చి మొక్కలు పెరిగాయి. చెత్తా చెదారాలు, పెద్ద పెద్ద రాళ్లు, రప్పలు కానవస్తున్నాయి. అంతేగాక గట్టులు ఆక్రమణలకు గురవుతున్నాయి. ఒక వైపు పూడ్చివేసిన గట్టు ప్రాంతంలో మాంసం దుకాణం వెలిసింది. ఇస్త్రీ బండి పెట్టుకొని, బట్టలు ఇస్త్రీ చేస్తున్నారు. పరిసర ప్రాంతాలకు చెందిన వారు కారులు పార్కింగ్ ప్లేస్‌గా ఉపయోగించుకుంటున్నారు. బోట్ క్లబ్ కల సాకరం అవుతుందో లేదో తెలియకుండా ఉంది. బోట్ క్లబ్ ఏర్పాటుతో పాటు ఒక వేళ పనులు ఆలస్యమైతే చెరువును పూడ్చకుండా చూడాలని, చెరువు గట్లు అయినా ఆక్రమణలకు గురి కాకుండా చూడాలని, పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు కోరుతున్నారు.

శుభ్రతే మంచి ఆరోగ్యానికి సాకారం



హెల్త్ సెంటర్‌లో పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు

తణుకు అర్బన్: శుభ్రతే మంచి ఆరోగ్యానికి సాకారమని తణుకు సబ్ యూనిట్ అధికారి జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు బ్యాంక్ కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ ప్రాంతంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కీటక జనిత వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే దోమ పుట్టుకకు బ్రేక్ వేయాలని అందుకు అనుగుణంగా స్తబ్దతగా ఉన్న నీటి నిల్వలను ఎప్పటికప్పుడు తొలగించుకోవాలని సూచించారు. నీటినిల్వలు ఉన్న పాత్రలపై విధిగా మూతలు ఉంచాలని, చెత్తను డ్రెయిన్‌లు, ఖాళీ స్థలాల్లో, ఆరుబయట గానీ వేయకుండా డస్ట్‌బిన్‌లలో మాత్రమే వేయాలని సూచించారు. శుభ్రత పాటించడంలో అలసత్వతం వహిస్తే అనారోగ్యాలకు తలుపులు తెరచినట్లేనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు హెల్త్ సెక్రెటరీలు ఎస్.సుసన్న రాణి, టి.వెంకటలక్ష్మి, కె.నీలిమ, స్టాఫ్ నర్సు ఏలూరి భవాని, ల్యాబ్ టెక్నీషియన్ నాగబాబు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

జంగారెడ్డిగూడెం: గురవాయిగూడెం తెల్ల మద్ది చెట్టు కింద స్వయంభువుగా వెలసిన శ్రీమద్ది ఆంజనేయ స్వామిని బుధవారం ఎండోమెంట్ ట్రిబ్యునల్ చైర్మన్, దేవదాయశాఖ పూర్వపు కమిషనరు ఎం.పద్మ స్వామివారిని దర్శించుకున్నారు. పర్యవేక్షకులు రంగారావు వారికి స్వామికి శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. నిత్యాన్నదానానికి తాడేపల్లిగూడేనికి చెందిన గుత్తికొండ ప్రసన్న లక్ష్మి కౌసల్య రూ.1,00,001, దూబచర్లకు చెందిన వర్థినీడి చిరంజీవి ధర్మతేజ రూ.22,500 విరాళంగా సమర్పించినట్లు ఈవో ఆర్‌వీ చందన తెలిపారు.

ఐక్యంగా పనిచేసి అభివృద్ధి సాధించాలి

పెంటపాడు: అధికారులు, ప్రజాప్రతినిధులు కష్టించి పనిచేసి మండలాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా నిలపాలని ఎంపీపీ దాసరి హైమావతి పేర్కొన్నారు. బుధవారం ఆమె అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఐక్యంగా ఉండాలని, గ్రామాభివృద్ధిలో విషయంలో చర్చించుకొని వచ్చిన నిధులు అధికారుల సూచనలతో సక్రమంగా వినియోగిస్తూ అభివృద్ధిని సాధించాలన్నారు. వేసవిలో తాగునీటిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. బడ్జెట్‌లో ఇప్పటివరకు తాగునీరు, శానిటేషన్‌కు పూర్తి నిధులు ఖర్చు పెడుతున్నామన్నారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇరిగేషన్, ఉపాధి హామీ, నీటిసంఘాల సమన్వయంతో పూడుకుపోయిన సాగు, తాగునీటి కాల్వల మరమ్మతులు చేయించుకోవాలన్నారు. 45 రోజులు వ్యవధిలో ఈ పనులు త్వరితగతిన సాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇరిగేషన్, డ్రైనేజీల కాల్వల మట్టి పూడిక తీత తీయించి గ్రామాల్లో శ్మశానాలు, జెడ్పీ స్కూళ్లు పూడ్చుకొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వంలో నిధులు లేని కారణంలో గ్రామాల అభివృద్ధికి ఉపాధి హామీ పనిదినాలు సాధించాలన్నారు. తహసీల్దార్ సీతారత్నం మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన రెండో విడత రీసర్వేకు ప్రజలు సహకరించాలన్నారు. దర్శిపర్రులో 320 ఎకరాలలో ఉన్న అభ్యంతరాలను సభల ద్వారా తెలియజేయాలన్నారు. ఇప్పటికే కె. పెంటపాడు, పెంటపాడు గ్రామాల్లో ఉన్న ఈనాం సర్వే విషయంలో 85 శాతం సర్వే పూర్తయ్యిందన్నారు. డ్రెయినేజీ శాఖ, నీటిసంఘాల నేతలతో పాటు, పశుగణాభివృద్ధి శాఖ అధికారులు సమావేశానికి హాజరుకాలేదు. దీనిపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. అలంపురం, జట్లపాలెం, కోరిమిల్లి, కె. పెంటపాడు, కొండేపాడు, వల్లూరుపల్లి, రాచర్ల గ్రామాల సర్పంచ్‌లు సమావేశానికి హాజరుకాలేదు. ఈ ఎంపీడీవో బాలాజీ , వైస్ ఎంపీపీలు ముప్పిడి సరోజని, కొణతాల వెంకట్రావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



మండల పరిషత్ సమావేశ మందిరంలో మాట్లాడుతున్న ఎంపీపీ దాసరి హైమావతి

ఘనంగా కొండాలమ్మ ఉత్సవాలు

పెంటపాడు: మండలంలోని రావిపాడులో ఉగాది మహోత్సవాలలో భాగంగా నిర్వహించిన కొండాలమ్మ అమ్మవారి ఉత్సవాలు బుధవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా స్థానిక అమ్మవారి ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. గూడెం పట్టణం, బోడపాడు, రావిపాడు, అలంపురం, దువ్వ గ్రామాలకు చెందిన సుమారు 5 వేల మంది భక్తులు అమ్మవారి ప్రసాదం స్వీకరించారు. ఉప్పులూరి నాగసత్తులు ఆధ్వర్యంలో నిర్వాహకులు ఉప్పులూరి అంజిబాబు, ఝాన్సీ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఉదయం నుంచి ఆలయం వద్ద ప్రత్యేక భజన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఉప్పులూరి బ్రదర్స్, కొప్పిశెట్టి సోదరులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.



కొండాలమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

ప్రశాంతంగా జేఈఈ పరీక్ష

తాడేపల్లిగూడెం: జేఈఈ మెయిన్ పరీక్షలు బుధవారం స్థానిక శశి ఇంజనీరింగ్ కళాశాలలో ప్రశాంతంగా జరిగాయి. ఉదయం పరీక్షకు 60 మంది హాజరయ్యారు. మధ్యాహ్న సెషన్‌కు 57 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షలను డాక్టర్ సుభాష్ భగవాన్ పర్యవేక్షించారు. ప్రిన్సిపాల్ మొహమ్మద్ ఇస్మాయిల్, ఎన్‌టీఏ మార్గదర్శకాల ప్రకారం పరీక్షకు ఏర్పాట్లు చేశారు.

ప్రత్యేక శిక్షణ ద్వారా ఆటిజం లోపాన్ని నివారించుకోవచ్చు

పెంటపాడు: భవిత కేంద్రంలో ప్రత్యేక శిక్షణ ద్వారా చిన్నారుల్లో పుట్టుక ద్వారా వచ్చే ఆటిజం లక్షణాలను రూపుమాపవచ్చని పెంటపాడు ప్రభుత్వ బేసిక్‌స్కూలు హెచ్‌ఎం ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం పెంటపాడు బేసిక్‌స్కూల్‌లోని భవిత కేంద్రంలో ప్రపంచ ఆటిజం అవగాహన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఈఆర్పీ సునీత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నాడీ సంబంధిత రుగ్మతలపై వివరించారు. ఆటిజం సోకిన పిల్లలు సాధారణంగా ఉండేందుకు భవిత ప్రత్యేక శిక్షణ ద్వారా లోపాలను నివారించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజ్‌కుమార్ చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భవిత విద్యార్థులకు ఆటిజంపై అవగాహన సదస్సు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రపంచ ఆటిజం డే సందర్భంగా బుధవారం సుబ్బారావుపేటలోని భవిత దివ్యాంగుల కేంద్రంలోని విద్యార్థులకు మానవత స్వచ్ఛంధ సేవా సంస్థ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు స్నాక్స్, ఎనర్జీ థింగ్స్, డ్రాయింగ్ బుక్స్ అందజేశారు. మానవత సభ్యులు మాట్లాడుతూ నార్మల్ పిల్లలతో సమానంగా దివ్యాంగుల పిల్లలను చూడాలని సూచించారు. మానవత సంస్థ దివ్యాంగుల పిల్లలకు అండగా ఉంటుందని తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. ప్రత్యేక ఉపాధ్యాయులు బాల ఈశ్వరయ్య, ఎం.చంద్రకుమారి, అధ్యక్షులు పచ్చ వెంకటేశ్వరరావు, సెక్రటరీ యర్రా ఆంజనేయస్వామి, ట్రెజరరీ యెగ్గిన శరత్ బాబు, చేకూరి బంగరాజు, బురిడీ సతీష్, మిరియాల సతీష్, జి.రాజేంద్ర కుమార్, హరికుమార్, పాండురంగారావు, కె.బాలకృష్ణ, వెంకటాచలం, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ఆటిజం లోపం ఉన్న విద్యార్థులతో హెచ్‌ఎం, ఐఆర్పీలు



ఇరగవరం ప్రాథమిక పాఠశాలలో ఆటిజం దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ఆటిజంపై అవగాహన సదస్సు

ఇరగవరం: మండలంలోని ప్రాథమిక పాఠశాలలో బుధవారం ప్రపంచ ఆటిజం దినోత్సవ కార్యక్రమం పాఠశాల హెచ్‌ఎం కడలి సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ ఆటిజం లోపం ఉన్న పిల్లలు ఎవరితో సరిగ్గా కలవక పోవడం, ఒంటరిగా ఉండటం, చేసిన పనినే, చెప్పిన మాటలనే పునరావృతం చేయడం వంటి లక్షణాలు కలిగి ఉంటారన్నారు. వీరికి ప్రత్యేకమైన కృత్యాలు చేయడం ద్వారా ప్రవర్తనాలోపాలు సరి చేయాలని చెప్పారు. తల్లి గర్భవతిగా ఉన్నప్పుడు మంచి పోషక ఆహారం తీసుకోవడం, డాక్టర్ పర్యవేక్షణలో మందులు సరిగ్గా వాడటం, వాయు కాలుష్యం, పరిక్యులేట్ పదార్థాలకు దూరంగా ఉండటం, తేలిక పాటి వ్యాయామాలు చేయడం వల్ల ఇటువంటి పిల్లలు పుట్టకుండా చూడవచ్చన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు పి రేణుక, కె రామకృష్ణ, కె సుబ్బారావు, ఎస్ రామకృష్ణ, ప్రత్యేక ఉపాధ్యాయులు ఎంటీ గాలేశ్వరరావు, వై జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



ఆటిజం దినోత్సవంలో పాల్గొన్న మానవత సభ్యులు

నేడు ముఖాముఖీలు

అత్తిలి: వివిధ కార్పొరేషన్ల నుంచి స్వయం ఉపాధి రుణాలు పొందెందేకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు స్వయం ఉపాధి పథకం కింద వివిధ యూనిట్ల కోసం దరఖాస్తు చేసుకున్నవారికి ఈనెల 4, 7 తేదీలలో ఇంటర్వ్యూలు జరుగుతాయని ఎంపీడీవో పి శామ్యూల్ బుధవారం తెలిపారు.ఈనెల 4న అత్తిలి, కె సముద్రపుగట్టు, ఉరదాళ్లపాలెం, ఆరవల్లి, దంతుపల్లి, ఉనికిలి, లక్ష్మీనారాయణపురం గ్రామాల వారికి, 7న బల్లిపాడు, గుమ్మంపాడు, తిరుపతిపురం, వరిఘేడు, పాలి, మంచిలి, కంచుమర్రు, స్కిన్నెరపురం, పాలూరు, కొమ్మర, ఈడూరు గ్రామాల వారికి ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. బీసీ, ఓసీ, కాపు, ఈడబ్ల్యూఎస్ సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హజరుకావాలన్నారు.

కొనసాగుతున్న నాటిక పోటీలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని బీవీఆర్ కళాకేంద్రంలో అధ్యక్షుడు బుద్దాల వెంకట రామారావు ఆధ్వర్యంలో జాతీయస్థాయి ఉగాది నాటిక పోటీలు జరుగుతున్నాయి. బుధవారం రాత్రి జనరల్ బోగీలు నాటిక పాల్గొన్న సభికులను అలరించింది. జనరల్ బోగీలో ప్రయాణిస్తు తన కొడుకు మృత్యువాతకు గురైతే అప్పటినుంచి మృతి చెందిన తన కొడుకు ఆచూకీ కోసం తల్లి పడుతున్న వేదన ఈ నాటిక. నిర్లక్ష్యానికి గురవుతున్న జనరల్ బోగీలు, రక్షణ, సౌకర్యాలు, భద్రతా లోపాలు అంశాలపై ఈ నాటిక ఎండకట్టింది. రైలు ప్రమాదంలో జనరల్ బోగిలో ప్రయాణించే వారు వివరాలు ఉండవు. మృతి చెందిన వారి వివరాలు, ఆచూకి తెలియదు. రిజర్వేషన్ బోగీలతో సమానంగా జనరల్ బోగీలు సంఖ్యను పెంచాలని, జీవితంలో రైలులో జనరల్‌బోగి ఎక్కని ప్రయాణీకుడు ఉండడుని, జనరల్‌బోగిలోకూడా భద్రంగా ప్రయాణించే రక్షణ కావాలని తదితర అంశాలను ఈ నాటికలో ప్రదర్శించారు. పట్టణ ప్రముఖులు, కళాకారులు పాల్గొన్నారు.



జనరల్ బోగీ నాటికలో సన్నివేశాలు

పొలాల్లోనే ధాన్యం విక్రయాలు

- అధికంగా ఎస్ఎల్-10, పీఆర్.126 రకాలు సాగు
- డిమాండ్ కారణంగా పచ్చిపైనే కొనుగోలు
- లాభసాటిగా ఉందంటున్న రైతులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలో కోసిన ధాన్యాన్ని కల్లాల్లోనే కోసి మిల్లులకు తరలించేస్తున్నారు. ప్రధానంగా ఎస్ఎల్-10, పీఆర్.126రకాలను నేరుగా కల్లాల్లోనే మిల్లర్లు కొనుగోలు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. మండలంలో ఎస్ఎల్-10 రకం 1300 ఎకరాలు, పీఆర్.126 రకం 2500 ఎకరాల్లో సాగు చేశారు. చీడపీడలను తట్టుకోవడంతో పాటు అధిక దిగుబడులనివ్వడంతో రైతులు ఈ రకాలను సాగు చేసేందుకు మొగ్గు చూపారు. ప్రధానంగా ఎల్.అగ్రహారం, కొండ్రుప్రోలు, మెట్ట ఉప్పరగూడెం, మోదుగ గుంట, పట్టింపాలెం, నీలాద్రిపురం, దండగర్ర, కొమ్ముగూడెం, గొల్లగూడెం, అప్పారావుపేట, లింగారాయుడిగూడెం, ఉప్పరగూడెం తదితర గ్రామాల్లో యంత్రాలతో కోతలు కోస్తున్నారు. రైతుల ఆశలను చిగురింపజేసేలా 70 నుంచి 80 బస్తాల దిగుబడులు వస్తున్నాయని రైతులు చెబుతున్నారు. అయితే, ఈ రకాలు తిండి గింజలు కాకుండా మరమరాలు, రవ్వ, జావకు వినియోగించడంతో ఎక్కువ డిమాండ్ పలుకుతుందంటున్నారు. దీంతో కమీషన్ దారులు నేరుగా కల్లాల్లోనే ఈ ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారని చెబుతున్నారు. గతంలో 75 కిలోల బస్తా పచ్చిపైన రూ.1360 పలకుగా, ప్రస్తుతం రూ.1410లు ధర లభిస్తుంది. ఎకరాకు రూ.98,700లు లభిస్తుందని రైతులు చెబుతున్నారు. అదే ఆరుదల రూ.85,700లు మాత్రమే వస్తుందని, అంతే కాకుండా పది బస్తాల తగ్గుతుందని పేర్కొంటున్నారు. ఆరుదల కంటే పచ్చిపై ధాన్యాన్ని అధిక ధర లభించడంతో ఆ ప్రకారం రైతాంగం విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడు. దీంతో ఈ రకాలు లాభసాటిగా ఉన్నాయంటున్నారు.



తాడేపల్లిగూడెం మండలం కొండ్రుప్రోలు గ్రామంలో మెషీన్లతో ధాన్యం కోస్తున్న దృశ్యం



కోసిన ధాన్యాన్ని బస్తాలకు ఎక్కిస్తున్న దృశ్యం

కల్లాలు లేక రోడ్లపైనే ధాన్యం



రైతులు కోసిన ధాన్యాన్ని ఆరబెట్టుకునేందుకు కల్లాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. దీంతో పచ్చిపైనే ధాన్యాన్ని కమీషన్‌దారులకు విక్రయిస్తున్నాం. ఆరుదలకు మంచి ధర వస్తుంది. ప్రభుత్వం కల్లాలను ఏర్పాటు చేయాలి. – బొట్టా కొండలరావు, రైతు, కొండ్రుప్రోలు, తాడేపల్లిగూడెం మండలం